# నవ్వండి! అంతా లాభమే!

నవ్వు నాలుగువిధాల నష్టం అని పాత సామెత. కాని నిజంగా హాయిగా నవ్వుకోగలిగితే నాలుగువిధాల లాభం - మందస్మితంలో అందం కనిపిస్తుంది - పకపక నవ్వుతే ఆనందం కల్గుతుంది. ఆనందం ఆరోగ్యం యిస్తుంది - అందరితో ఆనందంగా వుంటే ఆత్మీయత పెరుగుతుంది, అందుకే నవ్వు నాలుగువిధాల లాభం - అంపం,ఆనంగం, ఆరోగ్యం, ఆత్మీయత అందిస్తాయి. జీవితంలో అన్ని రంగాలలోనూ జీవితంలో హాస్యం కనిపిస్తూంది. ఒక మంత్రిగారు సభలో మాట్లాడుతున్నారు - 'ప్రజలారా! నేను యిప్పుడు యుద్ధమంత్రిని - మనదేశంలో యుద్ధాలు ఉండవని మీకు హామీ ఇస్తున్నాను - అన్నారు - వెంటనే ఓ పత్రికా విలేకరి లేచి సందేహం వెలిబుచ్చాడు -'కారణం చెప్పగలరా?' అని- 'ఏముంది చాలా చిన్న విషయం నేను ఆహారమంత్రిగా వున్నప్పుడు దేశంలో ఆహారం లేదు- ఇప్పుడు యుద్ధమంత్రిని కనుక యుద్ధాలు ఉండవు' అన్నారు మంత్రిగారు ఠీవిగా.

ఓ మంత్రిగారు దారినపోతూ రాత్రే ఓ సినిమా థియేటరు వద్ద "అండర్ రినోవేషన్" అని బోర్డు కనిపించింది - అయితే ఇక్కడ ఆడే సినిమా ఇదన్నమాట. అన్నారు మంత్రిగారు థియేటరు రిపేరులో వున్న సంగతి మరిచి. ఆయనే ఒకసారి ఆస్పత్రిలో "లేబర్ రూం" అని ఒక గది దగ్గర బోర్డు చూశాడు చాలా సంతోషించాడు - ఆస్పత్రులలోనే కాదు

అన్ని ఆఫీసుల్లోనూ 'లేబర్ రూమ్' మనం పెట్టిద్దాం' అన్నారు - లేబర్ రూమ్ అంటే ప్రసూతి అన్న సంగతి తెలీక.

ఓ మనుషుడు నాయనమ్మ అంటే చాలా ఇష్టపడేవాడు. 'నా బుజ్జి కన్నా మా ఆయన పేరేరా నీది' అని నాయనమ్మ తెగ ముద్దుపెట్టుకునేది! ఆ కుర్రాడిని. ఒ రోజు ఆ కుర్రవాడికి ఒ ఆలోచన వచ్చింది. 'డాడీ నేనొకటి అడుగుతా ఒప్పుకుంటావా?' అన్నాడు - 'ఏమిటిరా అది' తండ్రి గోముగా అడిగాడు. - 'డాడీ నేను నాయనమ్మను పెళ్ళి చేసుకుంటా డాడీ' అన్నాడు కుర్రాడు. తండ్రి తెల్లబోయాడు - 'తప్పురా నాయనా అలా అనకూడదు - అంది తల్లి కుర్రాడిని దగ్గరకు తీసుకుని 'ఏం డాడీ! నువ్వు మా అమ్మను పెళ్ళి చేసుకున్నావుగా! నేను మీఅమ్మను పెళ్ళి చేసుకుంటే ఏమౌతుంది! అని ప్రశ్నించాడు. పిల్లల అమాయక మనస్తత్వం ఇలాంటి ప్రశ్నలకు దారితీస్తుంది.

నాటక రంగంలో ఔచిత్యం పాటించకపోతే అంతా నవ్వే! ఓసారి రంగస్థలంమీద దుర్యోధనుడికి, భీముడికి గదా యుద్ధం జరుగుతోంది. భీముడు దుర్యోధనుడి తొడ విరగ గొడతాడు. దుర్యోధనుడు మంచి పాటగాడు లెండి - చాలా మధురంగా నాల్గు పద్యాలుపాడి - బాగా నటించి, చివరకు చనిపోతాడు నేలకూలి. ప్రేక్షకులు ఆ దృశ్యం చూసి తన్మయత్వంలో 'వన్స్‌మోర్' అని తెగ అరిచారు - ప్రేక్షకుల కోరిక మన్నించాలని, చనిపోయిన దుర్యోధనుడు మళ్ళీలేచి మళ్ళీ పద్యాలు పాడి - మధురంగా తొడలు విరిగినందుకు మళ్ళీ బాధపడి చనిపోయాడు. చనిపోయిన దుర్యోధనుడు లేచి పద్యాలుపాడటమేమిటీ అని కొందరు అనుకోకుండానే యింకోసారి 'వన్స్‌మోర్' అని అల్లరి చేశారు - దుర్యోధనుడే సిగ్గుపడి, చచ్చినవాడుమళ్ళీ లేవలేదు.

ఇటువంటి మరొక సంఘటనే. ఒక హీరో, హీరోయిన్‌ను నాటకం మధ్యలో రసవత్తరంగా ఆకర్షణీయంగా, ముద్దెట్టుకుంటాడు గాఢంగా.

ప్రేక్షకులు వన్స్‌మోర్ అన్నారు. మళ్ళీ హీరో ముద్దెట్టుకున్నాడు. మళ్ళీ వన్స్‌మోర్ మళ్ళీ ముద్దులు ఇంక ప్రేక్షకులకు భలే నవ్వు! నాటకమంతా ఇంక ముద్దులమయమేకదా అని.

ప్రింటింగ్ వచ్చాక, అచ్చుతప్పులు లేకపోతే అది తెలుగు పుస్తకం కాదన్నారు కొందరు పెద్దలు. 'శాంతి' అని ప్రింట్ కావడానికి బదులు 'వాంతి' అంటే ఎలా వుంటుంది? అలాగే 'లోకసభ' అని ప్రచురించడానికి 'తోకసభ' అంటే ఎలా వుంటుంది? ఇంక 'అచ్చుతప్పులే' 'అప్పుతచ్చులు' అని ప్రింటుచేస్తే అంతా గందరగోళమే కదా!

ఏదైనా మాట్లాడేటప్పుడు వాచకం స్పష్టంగా వుండాలి. ముక్కుమాటకు, ముద్దమాటకు మనం నవ్వకుండా ఉండలేం. అలాగే నత్తిమాటకుకూడా. ఒసారి ఓ నాటకంలో శ్రీనాదుడు పాత్రధారి పోతనతో మాట్లాడుతూ 'బ్రావా పోయి ప్రయత్నించెద' అని ఒక 'రేఫ' ఎక్కువ వాడాడు. అంతే, ఆ పెద్దమనిషి తర్వాత ఎక్కడ కనిపించినా ఆయన శిష్యులు 'బ్రావా ప్రోయి ప్రయత్నించెద అని హేళన చేయసాగారు.

ఒక మళయాళీ టీచరు 'సింబుల్, అనేవాడు సింపుల్ అనే మాటను 'ఐయం పొసైబుల్ అనేవాడు. ఇంపాసిబుల్ అనే పదాన్ని పలకడానికి. తెలుగు తిట్లు విద్యార్థుల మీద ప్రయోగిద్దామని ఆయన ఓ విద్యార్థిని రహస్యంగా ఆశ్రయిస్తే 'వంకాయ, బీరకాయ, పొట్లకాయ' అని పదాలు తిట్లులుగా నేర్పితే వాటిని మళయాలీ టీచరు క్లాసులో విద్యార్థులపై వాడి హాస్యాస్పదుడయాడు. రకరకాల సన్నివేశాల్లో రకరకాల హాస్యం ఉద్భవిస్తుంది.

పెద్ద, చిన్న తారతమ్యం మరిచి కుటుంబాలలో ఛలోక్తులు విసురుకుంటుంటే సరదాగా జీవితం సాగిపోతుంది. హాయిగా నవ్వుకుంటుంటే, మనిషి సుఖంగా వుంటాడు. అందుకే నవ్వండి! నవ్వుకోండి. అంతా లాభమే. అయితే వెటకారం, హేళన మాత్రం హాస్యం కాదు. మనసులు నొప్పించకుండా మమతతో హాయిగా నవ్వుకోడం మనకు చాలా అవసరం.

• • •